"........................"

రచన:

శ్రీ బండారు కె. జీవన్

నీ ఉత్తరం అంది చాల రోజులైంది. తిరిగి ఎంత త్వరగా నీకు ఉత్తరం రాద్దామనుకున్నానో అంత ఆలస్యం అయింది - తెలీకుండా ఈ ఆలస్యానికి ఒక్కటిబద్ధకమే కారణం కాదు; ఈ మధ్య ఒక సంఘటన జరిగింది చెబితే నువ్వు బాధపడ్తావు. కాని, చెప్పకుండా ఉండలేక పోతున్నాను.

పదిరోజుల క్రిందట నీ శ్యామల కనిపించింది. పలకరించాను మాట్లాడింది. నీవిషయం ఎత్తేను. నవ్వింది. టాపిక్ మార్చివేసింది. కాని శ్యామల మారిపోయింది గురూ. మునుపు తను మాటాడుతుంటే ప్రతి నాలుగు మాటల్లో మూడుమాటలు నీ గురించి దొర్లేవి. ఒకొక్కప్పుడు ఆ సంభాషణల నిండా నువ్వుండేవాడివి. ఇప్పుడు అట్లా కాదు. ఏదో మార్పు...

ఈ ఆడవాళ్ళు చపల చిత్తులా—? ఏమో!

అంతకు ముందు ఒకసారి సినిమాహాల్లో కనిపించింది. నాముందు సీట్లోనే కూర్చుంది పలకరిద్దామనుకున్నాను. కాని ప్రక్కనే ఎవరో ఉన్నారు. ఉలిక్కిపడ్డాను. మధ్య శ్యామల ప్రక్కన ఆ వ్యక్తి... నీకు ఈ విషయాలన్నీ ఎలా చెప్పేది? నాకూ బాధ కలుగుతోంది.

సినిమాహాల్లో వాళ్లిద్దరూ ... ఒకరి పక్కన ఒకరు కూర్చుని ... ఒకటే నవ్వు... నిజం ... సినిమా చూడలేకపోయాను.

అసలు ఈ సంగతి నీకు రాయకూడదని అనుకున్నాను. కాని ...

పోనీలే ...

ఎందుకో సరిగా నాకే తెలియదు. మధ్యలో నాచమువుకుంటూ పడింది. పరీక్షలు దగ్గరకు వస్తున్నా సరిగా చదవలేక పోతున్నాను.

తిరిగి వారం క్రిందట శ్యామల కనిపించింది. ఒకతె కాదు. ప్రక్కన ... ఆ రోజు సినిమాహాల్లోనే చూసిన ఆ వ్యక్తితో కూడా...

నా చేతులెందుకో వొణుకుతున్నాయి... రాస్తుంటే. నువ్వెలా ఈషాక్‌ను భరిస్తావో నాకు అనూహ్యంగా ఉంది.

ఆ వ్యక్తి శ్యామల అన్నయ్యకాదు, నాకు అనూహ్యంగా వుంది.

ఆ వ్యక్తి శ్యామల అన్నయ్య కాదు. నాకు తెలుసు; ఎవరూ కాదు. ఎవరంటే ....

ఆరోజు వాళ్ళిద్దరూ రిక్షాలో వెడుతున్నారు.

శ్యామల నన్ను చూసింది.

రిక్షా ఆగుతుందేమో అనుకున్నాను.

ఆగలేదు.

తన తల తిప్పుకుని నన్ను చూడనట్లు ఆ వ్యక్తి వంక చూస్తోంది.

కనీసం నీగురించైనా నన్ను పలకరిస్తుందని అనుకున్నాను.

కోపం వస్తోంది.

నిన్న సాయంత్రం...

బీచ్‌కు వెళ్ళాను.

శ్యామల కనిపించింది.

పక్కన ఆ వ్యక్తి...చేతిలో చేయివేసుకుని నాముందే నడుస్తున్నారు.

వెనక్కు తిరిగి తానె పలకరించింది.

'బావున్నారా?' అంది శ్యామల.

నాకోపం అంతా ఇంకిపోయింది.

తలూపాను.

'మీరెలా అన్నారు?' అడిగాను.

'అలా అలా' అంది చేయి అలలా ఆడిస్తూ గాలిలో.

నవ్వొచ్చింది.

ఇసుకలో కూర్చున్నాము ... ముగ్గురమూ

ఆ వ్యక్తిని నాకు పరిచయం చేసింది.

'నమస్కారమండీ' ఆ వ్యక్తి చేతులో తామర కాడల్లా ఉన్నాయి. ఎడమ చేతి చిటికినవేలుకు రవ్వల ఉంగరం.

ప్రతినమస్కారం చేసి పరీక్షగా చూచాను. కోలముఖం గుండ్రటికళ్ళు ... చెవులకు ఎర్రటిదుద్దులు ... అందంగా ఉంది- శ్యామలకన్నా కాదు.

ఇంతకూ ఆ 'వ్యక్తి' ఎవరో తెలుసా నీ శ్యామల స్నేహితురాలు .... వసుంధర !

హా...హా...

—o—